సాక్షి మెదక్

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024

జైజై గణేశా..

- వాడవాడలో కొలువుదీరిన గణనాథులు
- మండపాలలో ప్రత్యేక పూజలు

గణపతి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో వాడవాడలా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏ వాడలో చూసినా వినాయక ప్రతిమలే దర్శనమిస్తున్నాయి. విశేషంగా నైవేద్యాలు సమర్పించి లంబోదరుడికి పూజలు చేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మెదక్ పట్టణంలోని జమ్మికుంట వీధిలో గల వీర సావర్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

– మెదక్ మున్సిపాలిటీ





మెదక్ పట్టణంలో గణనాథుడితో భక్తులు, కోళిగడ్డ వీధిలో ఆకట్టుకుంటున్న వినాయకుడు



మెదక్ పట్టణంలోని వీర హనుమాన్ కాలనీలో కొలువైన గణనాథుడికి భక్తుల ప్రత్యేక పూజలు

న్యూస్‌రీల్

10న జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

తూప్రాన్: ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు సిరిసిల్ల జిల్లాలో 10వ రాష్ట్ర జూనియర్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు జరుగుతున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణగుప్త ఆదివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే జిల్లా బాల బాలికల జట్టు ఎంపిక ప్రక్రియ ఈనెల 10వ తేదీన మాసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 7702445543, 8106555942 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజాభవన్ ప్రజావాణి 11కు వాయిదా

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 11వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10న ప్రజాభవన్‌లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశం ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి మార్చినట్లు చెప్పారు. జిల్లా నుంచి హైదరాబాద్ ప్రజావాణికి వెళ్లే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన నాయకులు



మహేష్ కుమార్‌గౌడ్‌తో కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆదివారం పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, చిలప్‌చెడ్ మాజీ జెడ్పీటీసీ శేషాసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి'

వెల్దుర్తి(తూప్రాన్): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులుగౌడ్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని శెట్టిపల్లికలాన్, రామాయిపల్లి, బండపోసాన్‌పల్లిలో జెండా పండుగలో భాగంగా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, నర్సింహారెడ్డి, సుధాకర్‌గౌడ్, పోతిరెడ్డి, శ్రీశైలం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో మద్య నిషేధం అమలు చేయాలి

పాపన్నపేట(మెదక్): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల్లో మద్య నిషేధం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు మొండి పద్మారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆదివారం ఈఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడుపాయల గుడి ప్రాంగణంలో భక్తులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని తెలిపారు. మద్యం మత్తులో నదిలో స్నానాలు చేసి ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. కమీషన్ల కక్కుర్తితో కిరాణా డబ్బాలో సైతం మద్యం అమ్మడాన్ని ఎక్సైజ్ పోలీస్ అధికారులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, కిరణ్, ప్రభాకర్, కృష్ణ, వినోద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మెదక్ మున్సిపాలిటీ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. పట్టణ శివారులోని మాయ గార్డెన్స్ పక్కన గల పుష్పల వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రాగా తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దీంతో ట్రాక్టర్ల యజమానులు వాటిని వదిలి అక్కడి నుంచి పారిపోయారు. వాగులో ఉన్న నాలుగు ట్రాక్టర్లను తహసీల్దార్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



జల దిగ్బంధంలోనే దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): దుర్గమ్మా మము రక్షించమ్మా అంటూ ఆదివారం వందలాది భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. వనదుర్గమ్మ ఆలయం ఇంకా జల దిగ్బంధంలోనే ఉంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజగోపురంలోని ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఈఓ చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పండ్ల తోటలకు ప్రోత్సాహం

- రైతులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ
- జిల్లాలో వెయ్యి ఎకరాలు లక్ష్యం
- ఇప్పటివరకు 559 ఎకరాల్లో సాగు

మెదక్‌జోన్: పండ్ల తోటల సాగుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జాబ్‌కార్డు కలిగి ఉండి ఐదెకరాలలోపు గల సన్న, చిన్నకారు రైతులకు భారీగా సబ్సిడీలు ఇస్తోంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేయాలనే లక్ష్యంతో అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటివరకు 559 ఎకరాల్లో సాగైనట్లు చెబుతున్నారు.



హవేళిఘనాపూర్ మండలంలో మామిడి మొక్కలు నాటిన రైతు

జిల్లాలో సుమారు 4 లక్షల ఎకరాల సాగు భూములు ఉండగా, వాటిలో ఏటా మూడు లక్షల పైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా వరిసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. కాగా జిల్లా అవసరాల మేరకు పండ్ల తోటలు సాగు చేయాలనే ఉద్దేశంతో అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా, మండలానికి 50 ఎకరాల చొప్పున జిల్లావ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా పేద సన్న, చిన్న కారు రైతులకు భారీగా సబ్సిడీలు అందిస్తోంది. ఇందులో భాగంగా రైతులకు విరివిగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తుంది. కాగా ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 559 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు కాగా ఇంకా 441 ఎకరాల్లో సాగు కావాల్సి ఉంది. అయితే నాటిన మొక్కలకు 3 ఏళ్ల తర్వాత కాత వస్తోంది. అప్పటివరకు సంరక్షణ కింద ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఏడాదికి ఎకరానికి రూ. 857 చొప్పున మూడేళ్లకు రూ. 2,571 సంబంధిత రైతు ఖాతాలో జమ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సబ్సిడీలు ఇలా..

జాబ్‌కార్డు ఉండి ఐదెకరాల లోపు గల రైతులను గుర్తించి వారిని పండ్లతోటల సాగు వైపు మళ్లిస్తున్నారు. ఎకరాకు 70 మొక్కల వరకు నాటాల్సి ఉంటుంది. ఇందులో గుంతలు తవ్వేందుకు ఒక్కోదానికి భూమి గట్టి తనాన్ని బట్టి రూ. 56 నుంచి రూ.228 వరకు ఇస్తున్నారు. అలాగే మొక్కలు నాటేందుకు సైతం ఒక్కోదానికి రూ. 40 నుంచి రూ. 46 వరకు ఇవ్వనున్నారు. మొక్కలకు సైతం ఒక్కోదానికి ఒక్కోరకం ధర నిర్ణయించారు. ఇందులో జామ రూ. 30 సపోట రూ. 37, నిమ్మ రూ. 25, దానిమ్మ రూ. 24, మునగా 15, కొబ్బరి రూ. 150 ఇలా.. పండ్ల మొక్కల రకాలను బట్టి ఇస్తారు. అంతేకాకుండా వీటికి ఉద్యానవన (హార్టికల్చర్) శాఖ ద్వారా డిప్పుకు సైతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ఇస్తుండగా, ఇతర కులాలకు చెందిన వారికి 90 శాతం సబ్సిడీపై డ్రిప్పు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సాగు విస్తీర్ణం పెంచుతాం

జిల్లాలో పండ్ల తోటల సాగు పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది 1000 ఎకరాలు సాగు చేయాలనే టార్గెట్ ఉంది. ఇప్పటి వరకు 559 ఎకరాల్లో సాగైంది. ఇంకా 441 ఎకరాల్లో సాగు కావాల్సి ఉంది. రైతులకు విరివిగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం అందించే సబ్సిడీని వినియోగించుకొని పండ్లతోటలు సాగు చేస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు మంచి లాభాలు గడించవచ్చు.

– శ్రీనివాస్‌రావు డీఆర్‌డీఓ

బాధితులను ఆదుకుంటాం

కలెక్టర్ రాహుల్‌రాజ్



వర్షాలతో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): భారీ వర్షాలతో ఇళ్లు కూలిపోయిన వారి వివరాలు సేకరించి ఆదుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో కూలిపోయిన ఇళ్లను స్వయంగా పరిశీలించారు. ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కూలిపోయే దశలో ఉన్న ఇళ్లలో నివసించే వారికి వెంటనే ప్రభుత్వ భవనాల్లో పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం ద్వారా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో భారీ వర్షాలు, వరద నష్టాన్ని యుద్ధ ప్రాతిపదికన అంచనా వేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని వివరించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా పంచాయతీ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ప్రజలు జ్వరాలు బారినపడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నవీన్, అధికారులు, ప్రజలు ఉన్నారు.

నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలి

- కవుల నుంచి అర్థమయ్యే కవిత్వాలు రావాలి
- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజలకు సులువుగా అర్థమయ్యేలా కవులు కవిత్వాలు రాసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న అన్నారు. అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారి ఆధ్వర్యంలో మిత్ర బృందం సహకారంతో ఆదివారం స్థానిక ఎంజీ ఫంక్షన్ హాల్‌లో కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కాళోజీ చిత్రపటానికి నివాళర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాహిత్యానికి కులం, మతం అడ్డురాదని.. ఆ కోణంలో అసలే చూడొద్దని సూచించారు. ప్రముఖ సాహితీవేత్త ఏనుగు రాంరెడ్డి మాట్లాడుతూ.. కాళోజీ తెలుగు యాస, సంస్కృతుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక గౌరవ అధ్యక్షుడు నర్సింలు గుప్తా మాట్లాడుతూ.. సాహితీకారులకు సదాశివపేట పట్టణం పుట్టినిల్లు అని అన్నారు.

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక టీంలు
- అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు

మెదక్ మున్సిపాలిటీ/అల్లాదుర్గం: వినాయక చవితి వేడుకలను అందరూ ఐకమత్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం సమయంలో ఊరేగింపుగా వెళ్లే రూట్లు, కాలనీలు, ట్రాఫిక్, నిమజ్జనం చేసే ప్రాంతాల్లో విధులపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మసీదుల వద్ద ముస్లిం మతపెద్దలతో పాటు హిందు పెద్దలతో ఎప్పటికప్పుడు మాట్లాడి ప్రశాంతంగా జరుపుకునేలా చూడాలన్నారు. మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతి పత్రాలు పొందాలన్నారు. వేడుకల సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇతర మతాల వారికి ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే ప్రజలు డయల్ 100, జిల్లా పోలీస్ కంట్రోల్ రూం 8712657888 నంబర్‌కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అల్లాదుర్గం సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్లాదుర్గ్ సర్కిల్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రేణుకారెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు




పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, నాయకులు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 10వ తేదీ నుంచి 17 వరకు వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఇందుకు సంబంధించిన బుక్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు. ఈ పోరాటం ప్రపంచంలోని రైతుల తిరుగుబాట్ల అన్నింటిలో అగ్రస్థానం పొందినట్లు తెలిపారు. వారోత్సవాలకు జిల్లాలోని ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యాస.. సిద్దిపేట శ్వాస

- కాళోజీ అడుగు జాడల్లో కవులు, రచయితలు
- నేడు తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవం



ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): ఏ భాషా సాహిత్యాలైనా ఆ ప్రాంత జీవన స్థితిగతులను, చారిత్రక ప్రాధాన్యతలను వ్యక్తపరిచే అమూల్య సాధనాలు. ఆ క్రమంలో రచనకు భాష ప్రాణాధారమైతే.. భాషకు ప్రాణాధారం యాస. తెలంగాణ యాసకు ప్రత్యేక స్థానం ఉంది. యాసకు సిద్దిపేట పట్టం కట్టిందనే చెప్పాలి. ప్రాంతీయ భాషకు పట్టం కట్టిన వైతాళికుడు కాళోజీ.. సోమవారం జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.. ఉద్యమంలో కాళోజీ మాట, యాస ప్రత్యేకతను చాటాయి. సిద్దిపేట గడ్డపై జన్మించిన మాజీ సీఎం కేసీఆర్ యాసలో ఉద్యమానికి వన్నె తెచ్చారు. ఉద్యమంలో ప్రముఖ కవి, తొలి తెలుగు సాహిత్య పరిషత్ చైర్మన్ నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, అందెశ్రీ, తదితరులు చేతలలో, రాతలలో, ఆలోచనలలో, ఆవేదనలో, ఆహార్యంలో, తెలంగాణ స్వరూప స్వభావలను సంపూర్ణంగా తెలంగాణ మాండలికంలో ప్రజలకు తెలిపారు. వీరితో పాటుగా మంజీర రచయితల సంఘం, జాతీయ సాహిత్య పరిషత్, వెన్నెల సాహితి సంగమం, రచయితల సంఘం, రచయితల వేదిక, శ్రీవాణి సాహిత్య పరిషత్, సిద్దిపేట రచయితల సంఘం, వికాశ మండలిలోని కవులు, రచయితలు యాసను శ్వాసగా కవితలు, గేయాలు పాడుతూ ఉద్యమ ఆకాంక్షను ప్రజల్లో రగిలించారు. తెలంగాణ మాండలికాన్ని కాపాడుతూ తమ వృత్తులను నిర్వహిస్తున్నారు.

చరిత్ర శిథిలం..!

రామాయంపేట(మెదక్) : చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న గడికోటలు శిథిలమవుతున్నాయి. వీటి మరమ్మతు విషయమై ప్రభుత్వాలు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గత వైభవాన్ని చాటిచెప్పిన గడీలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. జిల్లా పరిధిలోని 469 పంచాయతీల్లో సుమారుగా 250 వరకు గడీలు ఉండగా, వీటిలో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి.

- కాలగర్భంలోకి గడికోటలు
- జిల్లాలో 155కు పైగా పాక్షికంగా ధ్వంసం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

జిల్లా పరిధిలో మొత్తం 250 వరకు గడికోటలు గత వైభవానికి చిహ్నంగా ఉన్నాయి. గతంలో గడీలకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. ప్రస్తుతం వీటి ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో 155కు పైగా పాక్షికంగా శిథిలమై కూలే ప్రమాదం ఏర్పడింది. కాగా ఈ గడీలను వందేళ్లకు ముందే నిర్మించినట్లు తెలిసింది. అప్పటి పాలకులు తమ శత్రువుల రాకను దూరం నుంచే తెలుసుకునేలా గ్రామానికి ఎత్తయిన ప్రదేశంలో నిర్మించినట్లు పెద్దలు చెబుతుంటారు. శత్రువులు నేరుగా గ్రామాల్లోకి రాకుండా నిలువరించడానికి వీటిని ఉపయోగించేవారిని తెలిసింది. వాటి నిర్వహణ విషయమై ఆయా పంచాయతీలు చేతులెత్తేయడంతో రోజురోజుకు అవి శిథిలమవుతున్నాయి. గ్రామాల్లో ఒక్కో గడీది ఒక్కో చరిత్ర కాగా, ఇవి శిథిలమవుతుండడంతో వాటి చరిత్ర సైతం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చరిత్రకు ఆనవాళ్లు..

దట్టమైన అటవీ ప్రాంతంలోఉన్న మండలంలోని సదాశివనగర్ తండాలో సుమారు 150 ఏళ్ల క్రితం గడి నిర్మించిన తర్వాతే అక్కడ తండా వెలిసినట్లు పలువురు గుర్తుచేసుకున్నారు. ఈ గడి వద్దకు తరచూ అప్పటిరాజులు వేట కోసం వచ్చేవారని గిరిజనులు చెబుతున్నారు. నేడు గడికోట పూర్తిగా శిథిలమైంది. ఝాన్సిలింగాపూర్ గడికి పెద్ద చరిత్రే ఉంది. అప్పటి పాలకులకు సంబంధించి వంశంలో కొందరు ఇప్పటికీ గ్రామానికి వచ్చి వెలుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఈగడి స్థలాన్ని పంచాయతీవారు పర్యవేక్షిస్తున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో గతంలో నిర్మించిన గడీలు రహదారికి అడ్డుగా ఉన్నాయి. పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితుల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిజాంపేట, కాట్రియాల గ్రామాల్లో రోడ్డును ఆనుకొని ఉన్న గడులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. తరచూ గడీలకు సంబంధించి రాళ్లు ఊడిపడుతున్నాయి.



కాట్రియాలలో కూలుతున్న రాళ్లు



సదాశివనగర్ తండాలో పూర్తిగా శిథిలమైన గడీ

మరమ్మతులు చేయించాలి



గ్రామాల్లో నిర్మించిన ఈగడీలు చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్నాయి. ప్రసుతం చాలా వరకు పాక్షికంగా శిథిలమై ప్రమాదరకంగా మారాయి. ఈగడులను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తే గత వైభవం చాటి చెప్పే విధంగా ఉంటాయి. ఈవిషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కొప్పుల రాజయ్య, కాట్రియాల

క్లుప్తంగా

డ్యూటీకని వెళ్లిన యువకుడి అదృశ్యం


వంశీ

పటాన్‌చెరు టౌన్‌: డ్యూటీకని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని చిట్కుల్‌ కిర్బీ కాలనీకి చెందిన బేగరి కృష్ణ కుమారుడు వంశీ ఈ నెల 2న డ్యూటీకని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తండ్రి కృష్ణ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


కరుణాకర్‌ (ఫైల్‌)

నిజాంపేట(మెదక్‌): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందింది. ఈ సంఘటన శనివారం నిజాంపేట మండల పరిధిలోని చల్మెడలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రెడ్డి కరుణాకర్‌(26) తన వ్యవసాయ పొలంలో తండ్రి రెడ్డి ఎల్లయ్యతో కలిసి పంటకు యూరియా చల్లాడు. అనంతరం కాళ్లు కడుక్కోవడానికి వెళ్లి సమీపంలోని బ్రాహ్మణ చెరువులోకి వెళ్లినట్లు తెలిపారు. రెండు గంటల తర్వాతకు కుమారుడు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి చెరువు వద్దకు వెళ్లి చూడగా.. అక్కడ చెప్పులు కనిపించాయి. చెరువులో కాళ్లు జారి పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్‌ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



పటాన్‌చెరు టౌన్‌: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాటీ గ్రామం వైపు వెళ్లే దారిలో ఉన్న ఓ స్క్రాప్‌ దుకాణం వద్ద గుర్తుతెలియని మహిళ మృతిచెంది ఉండడంతో స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మహిళను పరిశీలించారు. బ్యాగ్‌ను చూసి యాచకురాలు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఉంటే బీడీఎల్‌ పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తకుప్పలో పసికందు

తిమ్మాపూర్‌లో హృదయవిదారక ఘటన


చెత్త కుప్పలో పసికందు

దుబ్బాకరూరల్‌: అప్పుడే పుట్టిన పసికందును చెత్తకుప్పలో పడేసి వెళ్లిపోయారు. ఈ హృదయవిదారకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక రూరల్‌ మండలం తిమ్మాపూర్‌లో శనివారం జరిగింది. సీడీపీఓ, గ్రామస్తులు తెలిపిన వివరాలు.... గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగశిశువును గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపాన ఉన్న చెత్త కుప్పలో వదిలేశారు. శిశువు ఏడుపు వినబడటంతో స్థానికులు గమనించి వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఐసీడీఎస్‌ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పసికందును సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. శిశువుకు ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నామని, ప్రస్తుతానికి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఐసీడీఎస్‌ సీడీపీఓ ఎల్లయ్య తెలిపారు.

ఇంటికప్పు కూలి వృద్ధురాలి మృతి

- టేక్మాల్‌లో పండగపూట విషాదం
- మంత్రి దామోదర దిగ్భ్రాంతి
- రూ.2.11లక్షలు అందజేత

టేక్మాల్‌(మెదక్‌): వినాయక చవితి పర్వదినాన టేక్మాల్‌లో విషాదం చోటు చేసుకుంది. వర్షానికి ఇంటిపై కప్పు కూలి ఆదివారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు.. టేక్మాల్‌లోని బీసీ కాలనీలో మంగళి శంకరమ్మ(63) దత్తయ్య, దంపతులు. వీరికి ముగ్గురు కుమారులుండగా వారిలో ఇద్దరు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. మరొకరు ఇక్కడే ఉంటున్నాడు. దత్తయ్య, శంకరమ్మ దంపతులు మరో ఇంట్లో నివాసముంటున్నారు. ఇద్దరూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం రాత్రి భోజనం చేసి వేర్వేరు గదుల్లో పడుకున్నారు. పది రోజులుగా కురుస్తున్న వర్షానికి నానిన గోడలు, పైకప్పు ఒక్కసారిగా గాఢ నిద్రలో ఉన్న శంకరమ్మపై పడింది. విషయం తెలుసుకున్న ఇరుగుపొరుగువారు శంకరమ్మపై పడిన ఇంటి వాసాలు, మట్టిని తొలగించారు. మృతదేహాన్ని పోలీసులు జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్‌ తెలిపారు.

మంత్రి దామోదర ఔదార్యం

ఇంటి పైకప్పు కూలి వృద్ధురాలి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఔదార్యాన్ని చాటుకున్నారు. తక్షణమే స్పందించి మృతురాలి కుటుంబానికి రూ.2.11లక్షల ఆర్థిక సాయాన్న కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్‌ ద్వారా అందజేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి హామి ఇచ్చారు. కాగా, వృద్ధురాలు మృతి చెందిన ఘటన తెలుసుకున్న మెదక్‌ ఆర్డీఓ రమాదేవి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. తహసీల్దార్‌ తులసీరాం, ఆర్‌ఐ సాయిశ్రీకాంత్‌ పంచనామా చేశారు. శంకరమ్మ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని ఆమె తెలిపారు. పురాతన ఇళ్లల్లో ఎవరూ ఉండ కూడదని ఆమె సూచించారు. అవసరమైతే అధికారుల సహాయం తీసుకోవాలన్నారు.


నగదును అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు


వర్షానికి కూలిన ఇల్లు, ఇన్‌సెట్‌లో శంకరమ్మ

పుష్కలంగా జలం.. పంటకు జీవం

విస్తారంగా వానలు

- సింగూరుకు జలకళ
- అలుగు పారుతున్న చెరువులు
- సంబురాల్లో సాగు రైతులు

పుల్‌కల్‌(అందోల్‌): పక్షంరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్‌ సాగుకు ఢోకాలేకుండా పోయింది. జిల్లాలో జలాశయాలు పొంగి పొర్లుతుండటం.. అలుగులు మత్తడి దుంకుతుండటంతో రైతులు ఆనందంలో ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఆరుతడి పంటలైన పత్తి, మినుము, పెసర, కంది నీటి తీరువ పంటలైన వరి ఎక్కువగా పండిస్తారు. సింగూరు కాలువల కింద 40వేల ఎకరాల్లో, నల్లవాగు కింద 20వేల ఎకరాలు, గంగకత్వ, మిలిగేరి ప్రాజెక్టుల ఆయకట్టు కింద వరి పంట వేస్తారు. జిల్లాలో ఉన్న చిన్న నీటి వనరులైన 19 వందల చెరువుల కింద వరి పంట అధికంగా పండిస్తారు.

ప్రారంభంలో వానల జాడలేక..

జూన్‌లో వానాకాలం ప్రారంభంకాగానే కురిసిన చిరు జల్లులకు రైతులు పత్తి, తదితర ఆరుతడి పంటలు వేశారు. ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా అప్పుడప్పుడు కురిసిన చిరు జల్లులకు మొలకలు పెరిగి కాతపూత దశకు చేరుకున్నాయి, సింగూరు పంట కాలువల్లో నీరు వదలక పోవడంతో రైతులు బోరుబావుల కిందనే వరినాట్లు వేశారు. ప్రారంభంలో పంట కాలువల్లో సింగూరు నీరు రాక పోవడంతో బోరు బావుల కిందనే వరినార్లు వేశారు. జూలై, ఆగష్టు నెలల్లో చిరుజల్లులు కూడా పడకపోవడంతో రైతులు ఆందోళన చెందారు, ఓ దశలో పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోతామా? అని దిగులు చెందారు. సింగూరు వరద కాలువలు విడుదల చేయాలని కలెక్టర్‌ వద్దకు రైతులు వెళ్లి సాగునీటి పరిస్థితిని వివరించారు.


ఏపుగా పెరిగిన వరి పైరు

ఆశలు సజీవం



పక్షం రోజులుగా కురుస్తున్న వానల వల్ల భూమి దాహార్తి తీరింది. పంటలకు జీవం పోసినట్టయింది. అంతకు ముందు ఎండలు కొడుతుండటంతో ఎనిమిది ఎకరాల్లో వేసిన పంటలు చేతి కందుతాయా? లేదా అన్న మీమాంసలో ఉంటిమి. ఇప్పుడు చెరువులు నిండటం, కాలువల్లో నీరు పారుతుండటంతో పంటలు పండుతాయన్న ధైర్యమొచ్చింది.

–కుమ్మరి రాజు రైతు ముద్దాయిపేట

భరోసా కలిగింది



భారీగా వానలు కురుస్తుండటంతో పంటలు పండుతాయన్న భరోసా వచ్చింది. రైతులు వానల కోసం ఎదురు చూస్తున్న క్రమంలో విస్తారంగా వర్షాలు రావడం చెరువులు, కుంటలు నిండటం ఆనందంగా ఉంది. సాగు చేస్తున్న వరి, పత్తి పంటలకు భరోసా కలిగింది. అయితే లోతట్టు ప్రాంతాల్లో పంటలు మునిగిన రైతులకు పరిహారం చెల్లించాలి

– కనకారెడ్డి రైతు, పోచారం

ఊపిరి పోసుకున్న పంటలు

అయితే.. ఆగస్టు మొదలు నుంచే భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతుల ఆశలు చిగురించాయి. జిల్లాలో ఉన్న భారీ ప్రాజెక్టులు, జలాశయాలు, చెరువులు, కుంటలు నిండి మత్తడి దుంకాయి. పంటలు ఊపిరి పీల్చుకున్నాయి. దీంతో రైతుల కళ్లలో ఆనందం తొంగిచూసింది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పంట నీట మునిగిన మిగతా పంటలు చిగురించాయి. లోతట్టు ప్రాంతాల్లో చేలల్లోని నీరు వెళ్లిపోతే మునిగిన పంటలకు ఢోకా ఉండదని వ్యవసాయాధికారులు అంటున్నారు.

సింగూరుకు జలకళ

ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో సింగూరు ప్రాజెక్టు పూర్తిగా నిండింది. మంత్రి దామోదర రాజనర్సింహ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

వర్షాల వేళ సస్యరక్షణ తప్పనిసరి

రైతులకు మండల వ్యవసాయ అధికారి సూచనలు


జయంత్‌ కుమార్‌, మండల వ్యవసాయ అధికారి

చిన్నకోడూరు(సిద్దిపేట): విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో నీరు నిలిచి పంట కుళ్లిపోయే ప్రమాదం ఉంది. మరోవైపు చీడపీడలు ఆశించే అవకాశం . సకాలంలో చర్యలు చేపట్టకుంటే దిగుబడులు తగ్గుతాయి. సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టాన్ని నివారించవచ్చని వ్యవసాయ అధికారి జయంత్‌ కుమార్‌ సూచిస్తున్నారు.

వరి పంట..

వరి పొలంలో నీరు నిలవడం వల్ల పంట కుళ్లిపోయే అవకాశం ఉంది. నివారణకు 2.5 గ్రాములు కార్బండజిమ్‌, మ్యాంగోజెబ్‌ లేదా మిల్లీ లీటర్‌ మైసిన్‌ వాలిడామైసిన్‌ లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అగ్గి తెగులు ఆశిస్తే 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్‌ మందును లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేస్తే మేలు. రెండో దఫా యూరియా వేసుకోవడానికి అనుకూలమైన సమయం. ఎందాకు తెగులు ఆశిస్తే నత్రజనిని మోతాదుకు మించి ఉపయోగించకూడదు.

మొక్కజొన్న పంట..

నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలు ఉదారంగులోకి మారే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పంట గింజపోసే దశలో ఉంది. వర్షాలు తగ్గిన తరువాత 20 గ్రాముల డీఏపీ మందును లీటర్‌ నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. వాటితో పాటు ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్‌ వేసుకోవాలి. కాండం తొలుచు పురుగు, ఆకు ఎండు నివారణకు ఎకరానికి 400 మి. లీ ప్రొఫినోపాస్‌, 200 మి. లీ ప్రొఫినోజోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి చేను బాగా తడిసేలా పిచికారి చేయాలి.


నీటిలో ఉన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పత్తి పంట..

పత్తి ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్‌ ఆఫ్‌ పొటాష్‌ వేయాలి. కలుపు నివారణకు లీటర్‌ నీటికి రెండు మి. లీ క్విజాల్‌పాప్‌ ఇథైల్‌ , 1.25 ఎంఎల్‌ పైరిత్రిబాక్‌ సోడియం మందును కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు లీటర్‌ నీటిలో 3 గ్రాముల కాపర్‌ ఆక్సిక్లోరైడ్‌ను కలిపి పిచికారి చేస్తే మేలు చేకూరుతుంది.

దరఖాస్తులు ఆహ్వానం

జోగిపేట(అందోల్‌): స్థానిక నెహ్రూ మెమోరియల్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పీ రమేశ్‌ ప్రకటనలో కోరారు. తెలుగు, ఆంగ్లం, కంప్యూటర్‌ సైన్స్‌ అప్లికేషన్స్‌, ఎకనామిక్స్‌, జంతు శాస్త్రం విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హతలు కలిగిన వారు తమ ధ్రువపత్రాలతో ఈనెల 10న ఉదయం 10 గంటలకు సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ నెట్‌ సెట్‌ పీహెచ్‌డీ ఉత్తర్ణత కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

మండపాల వద్ద సీసీ కెమెరాలు

– నిర్వాహకులకు ఏసీపీ సూచన

గజ్వేల్‌రూరల్‌: భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులను జరుపుకోవాలని గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్ఠించిన వినాయక మండపాలను సీఐ సైదాతో కలిసి ఆయన పరిశీలించి నిర్వాహకులకు సలహాలు, సూచనలు చేశారు. నిర్వాహకులు వినాయక మండపాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారుల ఫోన్‌ నంబర్లను ప్రదర్శించాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చిన్నశంకరంపేట(మెదక్‌): చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఖాజాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాపూర్‌లో మేస్త్రీగా పనిచేసే బీహార్‌ రాష్ట్రం బాచాగామ్‌కు చెందిన ఎండీ బాబుల్‌(30), అతని బంధువు దిలానావాజ్‌తో కలిసి శనివారం బైక్‌పై ఖాజాపూర్‌ నుంచి రామాయంపేటకు వెళ్తుంటారు. కావేరి పరిశ్రమ సమీపంలో నడిరోడ్డుపై లారీని నిలపడంతో బైక్‌ వెళ్లి లారీని వెనక నుంచి ఢీ కొట్టింది. తీవ్రగాయాలకు గురైన వారిని రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. అనంతరరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా ఆదివారం ఉదయం ఎండీ బాబుల్‌(30) మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లయిన మూడు నెలలకే..

కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


శైలజ (ఫైల్‌)

హవేళిఘణాపూర్‌(మెదక్‌): అత్తింటివారి వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రేమ వివాహం చేసుకున్న మూడు నెలలకే అఘాయిత్యం చేసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని వాడి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇమ్మడి శైలజ(19) అదే గ్రామానికి చెందిన బలిజ అనిల్‌తో మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. కొన్ని రోజులు సజావుగా సాగిన వీరి కాపురంలో అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. రోజురోజుకు వేధింపులు ఎక్కువకావడం కలత చెందిన శైలజ.. పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను మెదక్‌ ఆస్పత్రికి, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందింది. వరకట్నం వేధింపులు తాళలేక తన చెల్లెలు ఆత్మహత్య చేసుకుందని, కారకులైనన ఆమె భర్త, అత్తమామలపై చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృత్యువాత

వేర్వేరు ప్రమాదాల్లో ఘటన


ప్రభాకర్‌ (ఫైల్‌)

కొమురవెల్లి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్‌ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లెనిన్‌నగర్‌ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రైవేట్‌ ఉపాధ్యాయుడు దాసరి ప్రభాకర్‌(35) సొంత పనుల నిమిత్తం చేర్యాల పట్టణానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గుర్జకుంట వాగు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌ రెడ్డి ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రతినిధుల ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేశారు.

లారీ ఢీకొని..

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని ఆరూర్లో చోటు చేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగులపల్లికి చెందిన బేగరి నర్సింలు (45) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామానికి చెందిన అఖిల్‌ ద్విచక్ర వాహనంపై ఆరూర్‌కు బయలుదేరారు. పనులు పూర్తి చేసుకొని ఇద్దరు కలసి ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఆరూర్‌ సమీపంలోకి రాగానే జహీరాబాద్‌ వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ వీరి బైకును బలంగా ఢీకొనింది. దీంతో నర్సింలుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అఖిల్‌ గాయాలతో బయటపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జల్సాల కోసం చోరీలు

- ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు
- మూడున్నర తులాల బంగారం, బైక్‌ స్వాధీనం


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను ఆదివారం హద్నూర్‌ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి మూడున్నర తులాల బంగారం, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. హద్నూర్‌లో పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలను జహీరాబాద్‌ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌ కాలనీకి చెందిన కూరు సంగప్ప పంచాయతీ రాజ్‌ శాఖలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈనెల 6న తన భార్యతో కలిసి బైక్‌పై న్యాల్‌కల్‌ మండల పరిధిలోని రేజింతల్‌లో గల బంధువుల శుభకార్యానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఇద్దరు బైక్‌పై అనుసరించారు. ఖలీల్‌పూర్‌ గ్రామ శివారులోకి రాగానే జనసంచారం లేకపోవడంతో వారి మెడలోంచి మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. చుట్టు పక్కల గాలించిన ఆచూకీ లభించలేదు. దీంతో బాధితులు హద్నూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం జహీరాబాద్‌ రూరల్‌ సీఐ హన్మంతు, ఎస్‌ఐ రామానాయుడు, ఝరాసంగం ఎస్‌ఐ నరేశ్‌, జహీరాబాద్‌ క్రైం టీం జైపాల్‌రెడ్డి, నర్సింహ, అస్లాం, పోలీసు సిబ్బంది రుక్మాపూర్‌ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బీదర్‌కు చెందిన సయ్యద్‌ మహమ్మద్‌, షేక్‌ నదియాల్‌ ప్యాసింజర్‌ ఆటోలో దిగి అనుమానాస్పదంగా రుక్మాపూర్‌ వైపు వెళ్తున్నారు. వారిని పట్టుకొని విచారించగా బంగారు గొలుసు దొంగించినట్లు బయట పడింది. నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

దొంగలు హల్‌చల్‌

- ఓ ఇంట్లో 3 తులాల బంగారం, 30 తులాల వెండి చోరీ
- మరొక గృహంలో దొంగతానికి విఫలయత్నం


సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: గ్రామాల్లో దొంగలు హల్‌చల్‌ చేశారు. ఈ సంఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జిన్నారం మండలం దాది గూడెం గ్రామానికి చెందిన మంజుల, ఆమె కుమారుడు ఇద్దరు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో పని చేస్తున్నారు. శుక్రవారం ఇద్దరు విధులకు వెళ్లగా వర్షం కారణంగా అక్కడే ఉండిపోయారు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి చూసేసరికి తలుపుల తాళం బద్దలు కొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, 30 తులాల వెండి దొంగలించుకుని పోయినట్లు బాధితురాలు గుర్తించి జిన్నారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా ఉట్ల గ్రామంలో కూడా దొంగతనానికి యత్నించగా ఇంట్లో వారు నిద్ర లేవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అయితే దొంగతనానికి యత్నిస్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డ్‌ అయ్యాయి. ఈ మేరకు బాధితురాలు మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులుదర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై కొండచిలువ



బెజ్జంకి(సిద్దిపేట): కొండచిలువ హల్‌చల్‌ చేసింది. బెజ్జంకి మండల కేంద్రంలోని కాలేజీ రోడ్డులో శనివారం రాత్రి కొండచిలువ ప్రత్యక్షమైంది. ఆ రోడ్డు గుండా వస్తున్న వాహనదారుడికి కొండచిలువ కనబడటంతో గట్టిగా కేకలు వేశాడు. తర్వాత ఇది అక్కడి నుంచి సమీపంలోని పంట చేనులోకి వెళ్లిందని తెలిపారు. ఇటీవల 3 రోజులు వరుసగా కురిసిన వర్షాలకు బయటికొచ్చి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు రాత్రి వేళలో తిరగడానికి జంకుతున్నారు.

స్నానం కోసం వెళ్లి..

చెరువులో మునిగి ఒకరి మృతి


కుర్మ శేకయ్య

కొల్చారం(నర్సాపూర్‌): చెరువులోకి స్నానానికంటూ వెళ్లిన వ్యక్తి ,ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వరిగుంతం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కుర్మ శేకయ్య (65) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ రిటైర్‌ అయ్యారు. పండుగ రోజు ఉదయం గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్దకు స్నానానికంటూ వెళ్లాడు. చెరువులోకి దిగి ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ గజ ఈతగాళ్లను రప్పించి చెరువులలో వెతకగా.. మృతదేహాన్ని వెలికితీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ నాయకులకు ప్రాధాన్యమివ్వాలి

– రాష్ట్ర కోకన్వీనర్‌ నరసింహారెడ్డి


నియామక పత్రాలు అందుకుంటున్న సభ్యులు

సిద్దిపేటకమాన్‌: మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, డైరెక్టర్‌ల నియామకాల్లో కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కిసాన్‌ సెల్‌ రాష్ట్ర కోకన్వీనర్‌ నాయిని నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియ దశలవారీగా జరుగుతోందన్నారు. రూ.రెండు లక్షలకు పైగా రుణం ఉన్న రైతులకు, రేషన్‌ కార్డు లేని రైతులకు కూడా త్వరలోనే రుణమాఫీ అవుతుందన్నారు. నంగునూర్‌ మండల కిసాన్‌ సెల్‌ అధ్యక్షుడిగా సత్యనారాయణ, జిల్లా సెక్రటరీగా వెంకటరెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శిగా రాజిరెడ్డిలను నియమిస్తూ నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మైపాల్‌రెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, హరి పాల్గొన్నారు.